క్లుప్తంగా

వేసవిలో రెండు పూటలా మంచినీటి సరఫరా


బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: వేసవిలో పట్టణ వాసులకు రెండు పూటలా సమృద్ధిగా మంచినీటి సరఫరా చేయాలని నిర్ణయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మంచి నీటి చెరువును పూర్తిస్థాయిలో నింపామన్నారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువు నిండా నీరు ఉండే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. 14 అడుగులు మేర నీటి నిల్వ ఉంటుందన్నారు. కాలువలు కట్టేసిన తరువాత 60 రోజుల పాటు రెండుపూటలా కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడినా వెంటనే మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

250 మందికి ఉచిత రక్తనాళ పరీక్షలు


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఏసియన్ వాస్క్యులర్ హాస్పటల్స్ సహకారంతో ఆదివారం ఉచిత రక్తనాళ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ రక్త నాళాల వైద్య నిపుణుడు డాక్టర్ జీవీ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సోమాచార్యులు 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి 40 మందికి లేజర్ ట్రీట్‌మెంట్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా ట్రీట్‌మెంట్ చేస్తారమని వివరించారు. హైదరాబాద్‌లో ట్రీట్‌మెంట్ చేసేందుకు ప్రయాణ ఛార్జీలను కూడా తమ సంస్థ భరిస్తుందని డాక్టర్ సోమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో గుడిమెట్ల బాలగంగాధర్‌రెడ్డి, దండు రామరాజు, గాదిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వాసవి మాత కొలువైన పెనుగొండ క్షేత్రంలోని శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్దని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో పౌర్ణమి సందర్భంగా ఆదివారం «చండీ హోమం» అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వడగం సత్యనారాయణమూర్తి బ్రహ్మత్వంలో కనుల పండువగా నిర్వహించిన ఈ చండీ హోమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లు ఏర్పాటు పర్యవేక్షించారు.

నేడు పండితవిల్లూరులో శ్రీరంగనాథరాజు ప్రచారం

పోడూరు: మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పండితవిల్లూరు గ్రామంలో ఎన్నికల శంఖారావ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రహదారులకు మహర్దశ

- గ్రామాల్లో రూ.కోట్లతో విస్తరణ పనులు
- అద్దంలా మారిన రహదారులు


విస్తరించిన పెనుగొండ దేవ రహదారి

పెనుగొండ: గత ప్రభుత్వ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆచంట నియోజకవర్గంలోని ప్రధాన రహదారుకుల మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రత్యేక కృషితో మోక్షం కలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరాక కోట్లాది రూపాయల వ్యయంతో ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తి చేయగా, కొన్ని రహదారులు నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా టీడీపీ పాలనలో పెనుగొండ మార్టేరు, పెనుగొండ దేవ, కవిటం గుమ్ములూరు రహదారుల్లో వాహనదారులు పడిన అవస్థలు వర్ణనాతీతం. కరోనా కష్ట కాలంతో మొదటి మూడుసంవత్సరాలు ఇబ్బందులు పడినా మాజీ మంత్రి ప్రణాళికాబద్ధంగా రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతో ప్రజలు ఇబ్బందులు తప్పాయి. వైఎస్సార్ సీపీ ప్రభుతం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే మార్టేరు నత్తా రామేశ్వరం రహదారి విస్తరణ పూర్తి చేసి పెనుమంట్ర మండలంలో ప్రధాన రహదారి నిర్మాణం ఇబ్బందులు తొలగించారు.

పెనుగొండ మార్టేరు రోడ్డుతో ఎన్నో ఇబ్బందులు

టీడీపీ పాలనలో పెనుగొండ మార్టేరు రహదారి నాణ్యత లేకుండా నిర్మించడంతో పూర్తిగా గోతులమయంగా మారింది. పెనుగొండ మార్టేరు సీసీ రహదారి నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషి చేశారు. రూ.4 కోట్లతో మరోసారి బీటీ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించారు. ఎక్కడా నాణ్యతాలోపం లేకుండా పనులు పూర్తి చేయడంతో నిర్మించి రెండేళ్ల పూర్తయినా రహదారి చెక్కు చెదరలేదు.


పెనుగొండ మార్టేరు రహదారి


కవిటం గుమ్ములూరు రహదారి

పెనుగొండ దేవ విస్తరణ

గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ వెళ్లే పెనుగొండ దేవ 7.7 కిలో మీటర్ల రహదారి జిల్లా పరిషత్ నుంచి ఆర్అండ్‌బీకి కాంగ్రెస్ ప్రభుత్వంలో బదలాయింపు జరిగినా రహదారి నిర్మాణానికి మోక్షం కలుగలేదు. దీంతో ఎన్నికల్లో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఇచ్చిన హామీ మేరకు పెనుగొండ దేవ రహదారి విస్తరణ, ఆచంట సిద్ధాంతం రహదారి విస్తరణకు రూ.17 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులు పారంభించి గ్రామాల మధ్య సీసీ రహదారుల నిర్మాణాలు, పంట కాలువలపై కల్వర్టుల నిర్మాణాలు పూర్తిచేసి, విస్తరణ పూర్తి చేశారు. త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయనున్నారు.

వివిధ రహదారులకు నిధుల కేటాయింపు ఇలా

ఆచంట నియోజకవర్గంలో ప్రధాన రహదారుల ఇబ్బందులు తొలగించేందుకు ఇటీవలే మరో రూ.5 కోట్లు మంజూరుకు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషిచేశారు. వీటితో వేల్పూరు నత్తా రామేశ్వరం రహదారిని రూ.కోటితో, సిద్ధాంతం జుత్తిగ రహదారిలో పెనుగొండ బ్రిడ్జిపై మరమ్మతులను రూ.35 లక్షలతోనూ, కొడమంచిలి సిద్ధాంతం రహదారిని రూ.40 లక్షలు, మార్టేరు ప్రక్కిలంక రహదారి మరమ్మతులకు రూ.45 లక్షలు, అత్తిలి ఇరగవరం రహదారికి రూ.15 లక్షలు, మార్టేరు వడలి రహదారికి రూ.55లక్షలు, తామరాడ రామన్నపాలెం రహదారికి రూ.35 లక్షలు, రామేశ్వరం కవిటం రహదారికి రూ.52 లక్షలు, మార్టేరు కోడేరు రోడ్డుకు రూ.20 లక్షల పోడూరు మండలంలో రహదారులకు రూ.65 లక్షలు చేపట్టనున్నారు.

ఇబ్బందులు తప్పాయి



మండలకేంద్రానికి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా కవిటం పోడూరు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు. ఇటీవలే రహదారి నిర్మాణం పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించారు.

– గుంటూరి పెద్దిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు, పోడూరు మండలం

అవస్థలు తీరాయి



కవిటం పోడూరు వెళ్లడానికి నానావస్థలు పడేవారం. ఆటోలో ప్రయాణించడానికి ప్రయాణీకులు భయపడేవారు. సుమారు 10ఏళ్ల నుంచి ఇవే అవస్థలు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషితో ఇబ్బందులు తప్పాయి.

– ఆదినారాయణ, ఆటో డ్రైవర్, కవిటం

కవిటం–గుమ్ములూరు రహదారి

పోడూరు మండలంలో కవిటం గుమ్ములూరు రహదారి నిర్మాణం 10 సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో రహదారి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు కావడంతో రహదారి నిర్మాణం పూర్తి చేసి ప్రజల అవస్థలు తొలగించారు. ఆచంట మండలంలో శేషమ్మ చెరువు, కరుగోరుమిల్లిలో ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పెనుగొండ: కులాలను కించపరుస్తూ, అసభ్యకరమైన పోస్టులును సోషల్ మీడియాలో పెడుతూ జీవితాలు నాశనం చేసుకోవద్దని నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం ఆచంట పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో కులాన్ని కించపరుస్తూ, అసభ్యకరంగా పోస్ట్ చేసిన ఆచంట మండలం శేషమ్మ చెరువుకు చెందిన పిల్లి సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక కులాన్ని కించపరుస్తూ పోస్టు చేయడంతో స్క్రీన్ షాట్ వేరే గ్రూపుల్లో షేర్ చేయడంతో వైరల్ అయ్యిందని తెలిపారు. దీనిపై ఆచంట మండలం కోడేరుకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సర్నెళ్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని వివరించారు. ఈ మేరకు పిల్లి సంతోష్‌కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఎవరైనా కులాలను, మతాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో కానీ, మరే ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో గానీ పోస్టులు పెడితే వారిపై చట్టారీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నిక నియమావళి అమలులో ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ కాళీచరణ్, ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తారామేశ్వరం యూనియన్ బ్యాంకు విలీనం


నత్తారామేశ్వరంలో మూతబడిన యూనియన్ బ్యాంకు శాఖా కార్యాలయం

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలో యూనియన్ బ్యాంకును పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో విలీనం చేస్తూ బ్యాంకు అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తూ నత్తారామేశ్వరం బ్యాంకును మూసివేశారు. గతంలో కార్పొరేషన్ బ్యాంకుగా ఉన్న ఈ బ్యాంకు కేంద్రం విలీనం చేసిన సందర్భంలో యూనియన్‌బ్యాంకుగా మార్పు చేశారు. అయితే పెనుమంట్రలో కూడా గతంలో యూనియన్ బ్యాంకు ఉండడంతో ఈ బ్యాంకు కేవలం కిలో మీటరు దూరంలో ఉండడంతో ఈ బ్యాంకును పెనుమంట్ర బ్యాంకులో విలీనం చేయాలని అధికారులు గతంలో ఖాతాదారులకు నోటీసులు ఇచ్చారు. అయితే ఖాతాదారులు దానిని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు కూడా చేశారు. చివరకు ఈబ్యాంకును పెనుమంట్ర బ్యాంకులో విలీనం చేస్తూ ఈనెల 20న బ్యాంకు వద్ద ప్రకటన బోర్డును తగిలించారు. ఈ నెల 21 నుంచి ఈ బ్యాంకు ఖాతాదారులంతా తమ బ్యాంకు లావాదేవీలను పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో నిర్వహించుకోవాలని కోరుతూ ప్రకటనను జారీ చేసి బ్యాంకును మూసివేశారు. అయితే అక్కడ ఉన్న ఏటీఎం మాత్రం యథావిధిగా పనిచేస్తుంది.

ఎన్నికల ప్రచారం ఆసక్తికరం


నాలుగో వార్డులో ప్రచారం బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్న గుడాల గోపి భార్య మంగతాయారు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని గెలిపించాలని కోరుతూ భార్య మంగతాయారు, కుమారుడు సాయిబాలాజీ ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 4వ వార్డులో ఆదివారం వీరు ప్రచారం చేశారు. మంగతాయారు మహిళలకు బొట్టు పెట్టి తన భర్త గుడాల గోపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కోడిగట్టు, జర్నలిస్టు కాలనీ, సూర్యనారాయణస్వామి దేవాలయం ప్రాంతాల్లో వీరు పర్యటించి ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌ని గెలిపించుకోవాలని ఓటర్లకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులతోపాటు ఆర్‌డీఎస్ఎస్ స్కీంలో కొత్త లైన్ల పనుల నిమిత్తం బ్రాడీపేట బైపాస్ రోడ్డు, బంగారువారి చెరువుగట్టు, కోడి గట్టు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

27న మార్కెట్ పన్ను వసూళ్ల వేలం

నరసాపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీలో డైలీ మార్కెట్ పన్ను వసూళ్లపై హక్కులు కల్పించేందుకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటదారులు సిండికేట్ కావడంతో ఇప్పటికే వేలం ఓ దఫా వాయిదా పడడం పాఠకులకు విధితమే.

నేడు దొడ్డిపట్లలో గుడాల గోపి ప్రచారం

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సోమవారం మధ్యాహ్నం నుంచి దొడ్డిపట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ పాతూరి బుచ్చిరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉమా వైద్యనాథేశ్వరస్వామికి జ్యోతిర్లింగార్చన


జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు

యలమంచిలి: పెనుమర్రు గ్రామంలోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సోమవారం గ్రామ బలిహరణ, త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహిస్తామని ఈఓ ఎన్.సతీష్‌కుమార్ వివరించారు. కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వహించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని ఆలయ నిర్మాత పాతూరి సోమరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని కాత్రేని గుంటకు చెందిన షేక్ అల్తాఫ్(27) చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు, అతని భార్య విడివిడిగా ఉంటున్నారు. మనస్తాపంతో 22న గడ్డిమందు తాగాడని, చికిత్స నిమిత్తం భీమవరం, తణుకు, ఏలూరు అనంతరం కాకినాడ తరలించారన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


మొగల్తూరు: నక్కావారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘస్తులు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెం ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని సంఘస్తులు మట్టలతో ర్యాలీ నిర్వహించారు. దావీదు కుమారుడా జయము..జయము అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం సంఘ కాపరి పైడి భూషణం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పెనుగొండలో...

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో మట్టల ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనల అనంతరం చిన్నారులు మట్టలతో పురవీధుల్లో తిరుగుతూ జయము జయము ఏసు క్రీస్తు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆచంట మండలం కొడమంచిలి పరిశుద్ధ పేతురు లూథరన్ చర్చి పారీస్ పాస్టర్ జేమ్స్ ఆధ్వర్యంలోనూ, పెనుగొండ మండలం ఇలపర్రుల్లో సెయింట్ పాల్స్ లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త పరిచర్య నిర్వహించారు. చినమల్లం, సిద్ధాంతం, పెనుగొండ, ములపర్రు, కోడేరు, వల్లూరు భీమలాపురంల్లోనూ మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఇలపర్రు పారిస్ పాస్టర్ పి.ప్రవర్ధన్ కుమార్, సంఘ సీఆర్‌పీ మదన్‌కుమార్, కొడమంచిలిలో సంఘ సీఆర్ ఇమ్మాన్యుయేలు, సంఘ పెద్దలు కోటి సుభాష్ చంద్ర బోస్, గుమ్మడి సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ: ఇలపర్రులో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న దృశ్యం

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం


క్షయవ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది

నరసాపురం: ఏ మాత్రం అనుమానం ఉన్నా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని, నరసాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ అన్నారు. ఆసుపత్రిలో ఆదివారం క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ ఆగకుండా దగ్గు, కఫం ఉండటం, బరువు తగ్గడం వంటి సూచనలు కనిపిస్తే కచ్చితంగా కఫం పరీక్ష చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ క్షయ అని నిర్ధారణైతే ఆరు నెలలు మందులు వాడితే క్షయ తగ్గుతుందని చెప్పారు. ఐసీటీసీ మెడికల్ కౌన్సెలర్ జి.జేసుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. క్షయ వ్యాధిని అంతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నళిని, ప్రశాంత్, గణేష్ పాల్గొన్నారు.

వేగంగా దానమ్మ ఆలయ నిర్మాణం


ఎస్.ఇల్లిందలపర్రులో నిర్మిస్తున్న దానమ్మ ఆలయం

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో కోటిన్నర రూపాయల వ్యయంతో పునర్నిర్మిస్తున్న దానమ్మ ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 28న ఉదయం 8 గంటలకు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 26, 27 తేదీల్లో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి, 28న నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి, ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

● ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం


పాలకొల్లు అర్బన్: 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


మొగల్తూరు: మొళ్ళపర్రులో వేకువజామున టీ తాగుతూ సమస్యలు తెలుసుకుంటున్న ప్రసాదరాజు


మొగల్తూరు: పేరుపాలెం సౌత్‌లో గ్రామస్తులను ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమను గెలిపించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఆదివారం మొగల్తూరు మంలంలోని పేరుపాలెం సౌత్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, పాలకొల్లు పట్టణంలోని నాలుగో వార్డులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్